క్లుప్తంగా

గణిత వారోత్సవాలు ప్రారంభం



చార్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత వారోత్సవాలను గురువారం ప్రారంభించారు. గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి సందర్భంగా ఈ నెల 22న గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గణిత ఉపాధ్యాయులు సరోజ్‌కుమార్, విజయవల్లి ఆధ్వర్యంలో విద్యార్థులకు గణితంపై పలు పోటీలు నిర్వహించారు. గణిత కీవర్డ్స్, నెంబర్ గేమ్, గణిత సోపాన చిత్రాలు, నిత్య జీవితంలో గణితం ఉపయోగాలు, డ్రాయింగ్, గణిత నమూనాలపై నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 22న బహుమతులు అందజేయనున్నారు.

17 నుంచి ధనుర్మాస పూజలు

అక్కిరెడ్డిపాలెం: బెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 17వ తేదీ నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథరావు తెలిపారు. ఆలయంలో ఈ నెల రోజులు నిత్యం తిరుప్పావై, విశేష పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 23న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ధనుర్మాస ఆరాధన, వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. జనవరి 11న కూడార్ై ఉత్సవం నిర్వహిస్తామన్నారు. భోగి సందర్భంగా 14న ఉదయం గోదా కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

గరుడ వాహనం ఏర్పాటుకు దాతల విరాళాలు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కొలువైయున్న తిరుమల బాలాజీకి గరుడ వాహనం ఏర్పాటుకు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయులు మాధురి సాయి, శశాంక్ రూ.10,116, ఉపాధ్యాయులు శాండిల్య, సుబ్బలక్ష్మి రూ.10,116, బొర్రా సత్యనారాయణ, పార్వతిల కుమారుడు బొర్రా రవిచంద్ రూ.10,116 అందజేశారు. నాతయ్యపాలేనికి చెందిన పెదిరెడ్ల గోపాలరావు, సుబ్బలక్ష్మి రూ.10,116 అందించారు.

దుర్గాలమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు యారాడ గ్రామంలోని దుర్గాలమ్మ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, కుంకుమార్చనలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధి గుజ్జారి శ్రీను, బంక ఆనందరావు, బంక అనిల్ ఆర్థిక సాయంతో అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా గుజ్జారి శ్రీను మాట్లాడుతూ ప్రతీ గురువారం అమ్మవారికి విశేష పూజలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జోరుగా పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

అగనంపూడి: ఉపాధ్యాయుల సమస్యలను సామరస్యంగా పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నామని పీఆర్‌టీయూ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దినాయుడు అన్నారు. పరవాడ మండల పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో పినమడక, ఫార్మాసిటీ కాలనీ, లంకెలపాలెం, పెదముషిడివాడ, తానాం పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో లంకెలపాలెం హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మరిశా బాబూరావు, కోవెల రవి, జిల్లా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నాడు: గాజువాక సుందరీకరణ పేరిట పార్కుల అభివృద్ధికి చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఇది గత ప్రభుత్వంలో పరిస్థితి.

నేడు: పార్కుల్లో సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. వివిధ పార్కుల్లో జిమ్‌లు ఏర్పాటయ్యాయి. పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు, వాకింగ్ కోసం ట్రాక్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఇది ప్రస్తుత **ప్రభుత్వంలో ప్రగతి.**

పార్క్.. న్యూ లుక్

- ఆహ్లాదకరంగా పార్కులు
- పచ్చదనం పరవళ్లు
- చిన్నారులకు ఆటవస్తువులు
- పెద్దలకు వాకింగ్ ట్రాక్
- సందర్శకుల హర్షం



ఇది కదా అభివృద్ధి

గాజువాక: పార్కులు నందన వనాలను తలపిస్తున్నాయి. పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. పిల్లలకు ఆటపరికరాలు, పెద్దలకు ఆహ్లాదకర వాతావరణం స్వాగతం పలుకుతున్నాయి. ఉయ్యాలలు, జారుడు బల్లలు, సిమెంట్ చప్టాలు, ల్యాండ్‌స్కేపింగ్ గార్డెన్, తాగునీటి సదుపాయం, వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి వచ్చాయి. ప్రతీ పార్కుకు రూ.4.5 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు వెచ్చించారు. కొన్నిచోట్ల గ్రావెల్ ఫిల్లింగ్ కూడా చేసి పార్కులను అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం మింది, విశ్వేశ్వరయ్య నగర్ కాలనీ, తిరుమల నగర్, భరత్‌నగర్, గాంధీనగర్, అమరావతినగర్‌లలో పార్కులను అభివృద్ధి చేశారు. మరిన్ని పార్కుల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మరికొన్ని పార్కుల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.



విశ్వేశ్వరయ్యనగర్ కాలనీ పార్కులో చిన్నారుల ఆట వస్తువులు



మింది పార్కులో ఆడుకుంటున్న పిల్లలు



అమరావతి పార్కులో వాకింగ్ చేస్తున్న స్థానికులు

అమరావతి పార్కు

వ్యయం	:	రూ.12 లక్షలు
చేసిన పనులు	:	ప్రహరీ, పెయింటింగ్, బల్లలు

విశ్వేశ్వరయ్య నగర్ కాలనీ పార్కు

వ్యయం	:	రూ.12 లక్షలు
చేసిన పనులు	:	ప్రహరీ, పెయింటింగ్, మొక్కలు, పిల్లల ఆట పరికరాల ఏర్పాటు

భరత్‌నగర్ పార్కు

వ్యయం	:	రూ.4.8 లక్షలు
చేసిన పనులు	:	ప్రహరీ, పెయింటింగ్ మొక్కలు

గాంధీనగర్ పార్కు

వ్యయం	:	రూ.6 లక్షలు
చేసిన పనులు	:	గ్రావెల్ ఫిల్లింగ్, ప్రహరీ పెయింటింగ్, వాకింగ్ ట్రాక్, బల్లల ఏర్పాటు


మింది పార్కు

వ్యయం	:	రూ.15 లక్షలు
చేసిన పనులు	:	ప్రహరీ నిర్మాణం, పెయింటింగ్, మొక్కలు, బెంచ్‌లు

తిరుమలనగర్ పార్కులు - 2

వ్యయం	:	36 లక్షలు
చేసిన పనులు	:	ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, ప్రహరీ పెయింటింగ్, మొక్కలు

సౌకర్యాలు బాగున్నాయి



పార్కులను అభివృద్ధి చేసి అందరికీ ఉపయోగపడే విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉదయాన్నే వాకింగ్ చేసుకోవడానికి పార్కులు అనువుగా ఉన్నాయి. గతంలో రోడ్లపై వాకింగ్ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు పార్కుల్లోనే వాకింగ్ ట్రాక్‌లు ఉండటంవల్ల సౌకర్యవంతంగా ఉన్నాయి.

– కె.రమణబాబు, కూర్మన్నపాలెం

పిల్లలు చక్కగా ఆడుకుంటున్నారు



మా గ్రామంలోని పార్కును చాలా బాగా తీర్చిదిద్దారు. అందులో పిల్లలు ఆడుకోవడానికి పరికరాలు ఉండటంతో సెలవుల్లో పిల్లలను పార్కుకు తీసుకొస్తున్నాం. చక్కగా ఆడుకుంటున్నారు. వారు ఫోన్లకు అతుక్కుపోకుండా కొంత సమయమైనా బయటకొచ్చి ఆడుకుంటున్నారని ఆనందంగా ఉంది.

– బాలాజీ, మింది

మాది పెద్ద వాకింగ్ ట్రాక్



మా కాలనీకి ఆనుకొని ఉన్న అమరావతి పార్కు చాలా పెద్దది. అందులో వాకింగ్ ట్రాక్ వాక్ చేయడానికి సౌకర్యవంతంగా ఉంటుంది. దీంతో పాటు వ్యాయామం చేయడానికి జిమ్‌ను ఏర్పాటు చేశారు. ఎవరికి ఏది ఇష్టమైతే ఆ విధంగా ఈ పార్కులో సాధన చేసుకొనే విధంగా అభివృద్ధి చేశారు.

– బి.శ్రీనివాసరావు, గోపాలరెడ్డినగర్



గాంధీనగర్ పార్కులో పిల్లల కరాటే సాధన

బ్రహ్మకుమారీల కృషి అభినందనీయం



విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణను సత్కరిస్తున్న బ్రహ్మకుమారీలు

అగనంపూడి: లోక కల్యాణం కోసం బ్రహ్మకుమారీలు చేస్తున్న కృషి అభినందనీయమని విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అన్నారు. అగనంపూడిలోని దివ్య జ్యోతి భవనాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఒత్తిడి, ఆందోళనలను యోగ సాధన, ధ్యానంతో అధిగమించవచ్చన్నారు. బ్రహ్మకుమారీలు తమ వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసి విశ్వశాంతికి కృషి చేస్తున్నారన్నారు. వీరి త్యాగానికి ప్రతిఫలం మనమంతా యోగ సాధన చేయడమే అన్నారు. కార్యక్రమంలో దివ్య జ్యోతి భవనం కో–ఆర్డినేటర్ బి.కె. రామకోటి, సీజీఆర్ఎఫ్ సభ్యులు హరిబాబు, ఏపీఈపీడీసీఎల్ ఈఈ సంబంగి రామకృష్ణ, విద్యుత్ అధికారులు ప్రసాద్, నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

ఇంధన వినియోగం తగ్గింపునకు మరింత కృషి



ఇంధన పొదుపు విభాగం ఉద్యోగులకు ట్రోఫీ అందజేస్తున్న డైరెక్టర్, సీజీఎం

ఉక్కునగరం: ఇంధన వినియోగం, వ్యయం తగ్గించడానికి ఉద్యోగులు అన్ని విభాగాలను మరింత సామర్థ్యంతో నిర్వహించాలని డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె. బాగ్చీ సూచించారు. జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవం సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎల్‌డీసీ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన కార్యక్రమాన్ని సీజీఎం (వర్క్స్) ఎస్.వి. స్వామితో కలిసి ప్రారంభించారు. ఉద్యోగులకు, పాఠశాలల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇంధన పొదుపులో ప్రతిభ చూపిన విభాగాలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు, వివిధ విభాగాధిపతులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గనుల లీజులను పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు రాష్ట్రంలో కేటాయించిన గనుల లీజులను పునరుద్ధరించాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. సిటూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో స్టీల్‌ప్లాంట్‌కు గర్భం మాంగనీస్ గని, సారిపల్లి ఇసుక రీచ్‌లను కేటాయించారన్నారు. లీజు గడువు ముగిసినా పునరుద్ధరించకపోవడం వల్ల ప్లాంట్‌పై భారం పెరుగుతోందన్నారు. బయట మార్కెట్ రేటుకు కొనడం ద్వారా ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ ఈవోఐ పేరుతో జిందాల్‌ను ప్లాంట్‌లోకి అనుమతిస్తే అంగీకరించబోమన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వై.టి. దాస్, పి.శ్రీనివాసరావు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న గోవింద మాలధారులు

పెదగంట్యాడ: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి విశిష్టతను, వైభవాన్ని చాటి చెప్పేలా పెదగంట్యాడ కాలనీల్లో ప్రచార రథాన్ని గురువారం శోభాయమానంగా నిర్వహించారు. అఖిల భారత గోవిందమాల ప్రచార చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పెంటకోట వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని గోవింద మాలధారులు ప్రారంభించారు. బీసీ రోడ్డు, పెదగంట్యాడ నిర్వాసిత కాలనీలు, వుడా కాలనీలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు రథాన్ని తిప్పారు. కార్యక్రమంలో గోవింద మాలధారులు పెంటకోట శంకర్రావు, నీలాపు మహేష్, సతీష్, విశాల్, జయ, విజయ తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లపై దాడులు



పెదగంట్యాడలోని ఓ హోటల్‌లో డొమెస్టిక్ సిలిండర్లను సీజ్ చేస్తున్న అధికారులు

పెదగంట్యాడ: మండలంలోని పలు హోటళ్లలో పౌర సరఫరాల శాఖాధికారులు, పెదగంట్యాడ మండల తహసీల్దార్ గురువారం దాడులు చేశారు. హోటళ్లలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్లకు బదులుగా డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తున్నారన్న సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించారు. ఏఎస్‌వో తవ్వా కృష్ణ, తహసీల్దార్ రమాదేవి ఈ దాడుల్లో పాల్గొన్నారు. ఐదు హోటళ్లపై కేసులు నమోదు చేశారు.

1036వ రోజుకు ‘ఉక్కు’ దీక్షలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమ అమ్మకపు ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1036వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో బ్లాస్ట్ ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఐక్య పోరాటాలతో ఉక్కు పరిశ్రమను రక్షించుకుంటామన్నారు.

మరో 30 ఏళ్లు జగనే సీఎం

- ఇదే ప్రజల ఆకాంక్ష
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- ఉత్సాహంగా ‘ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..’ కార్యక్రమాలు



67వ వార్డులో డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



66వ వార్డులో బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



86వ వార్డులో డిజిటల్ డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: మరో 30 ఏళ్లపాటు జగన్ మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని 66వ వార్డు కైలాసనగర్ సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సచివాలయం నుంచి నేరుగా లబ్ధిదారులకే అందే విధంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చారిత్రాత్మక విధానాన్ని తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో పేదలందరికీ న్యాయం జరగడం కోసం మళ్లీ ఆయన్నే ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, క్లస్టర్ అధ్యక్షులు రాజాన వెంకటరావు, ఎస్‌ఎండీ గౌస్, నాయకులు పెదిరెడ్ల ఈశ్వరరావు, రెడ్డి జగన్నాథం, కర్రి జగన్మోహన్, పేరం రామకృష్ణారెడ్డి, దేముడుబాబు, కుప్పిలి సత్యనారాయణ, రాజు, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

67వ వార్డులో..

ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని 67వ వార్డులోని సాయిరాంనగర్ సచివాలయ పరిధిలో గురువారం నిర్వహించారు. సచివాలయం పరిధిలో అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధిని ఎమ్మెల్యే నాగిరెడ్డి వివరించారు. అనంతరం డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షుడు ఎస్‌ఎండీ గౌస్, నాయకులు మీరాభాయి, అన్నపూర్ణ, నసీరుద్దీన్, సాహిద్ తదితరులు పాల్గొన్నారు.

86వ వార్డులో..

కూర్మన్నపాలెం: 86వ వార్డు ఫకీర్‌టకియా సచివాలయ పరిధిలో ‘ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..’ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పార్టీ జెండాను ఎగరవేశారు. సచివాలయ పరిధిలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని సూచించే డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంత కష్టమైనా, నష్టమైనా మాట మీద ఉండే వ్యక్తిత్వం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సొంతమన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో ఏపీని అగ్రస్థానంలో నిలిపారన్నారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగేందుకు మళ్లీ ఆయన్ను ముఖ్యమంత్రిని చేసుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెలుగుల పరశురాముడు, బొడ్డ గోవింద్, గద్దం శ్రీనివాస్, మాటూరి శ్రీనివాసరావు, నిర్మల, పట్నాయక్ పాల్గొన్నారు.

మంత్రి అమర్‌నాథ్‌కు కాపు వనభోజనాలకు ఆహ్వానం



మంత్రికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న కాపు సంక్షేమ సంఘం నాయకులు

అక్కిరెడ్డిపాలెం: శ్రీ కృష్ణదేవరాయ గాజువాక కాపు సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన అప్పికొండ బీచ్ వద్ద ఏర్పాటుచేసిన వనభోజన మహోత్సవానికి మంత్రి అమర్‌నాథ్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు మిందిలోని మంత్రి నివాసంలో సంఘం ప్రతినిధులు ఆయన్ను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు జె్రిపోతుల ముత్యాలు, ప్రధాన కార్యదర్శి తలారి వెంకటరమణ, ఉపాధ్యక్షులు ముమ్మన అప్పారావు, గొల్లవిల్లి నూకరాజు తదితరులున్నారు.

కలెక్టర్, కమిషనర్ దృష్టికి 75వ వార్డు సమస్యలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డులో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మకు ఆ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి వినతిపత్రాలు అందించారు. పెదగంట్యాడ శ్మశానవాటికలో ఆధునికీకరణ పనుల వేగవంతం, బీసీ రోడ్డు నిర్మాణం, రైతుబజారు ఆవరణలో సీసీ ఫ్లోరింగ్ తదితర అంశాలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. పులి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా

అక్కిరెడ్డిపాలెం: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు గురువారం ధర్నా చేపట్టారు. అంగన్‌వాడీ సెంటర్లకు తాళం వేసి టీచర్లు, ఆయాలు ధర్నాలో పాల్గొనడంతో సెంటర్ల ద్వారా రేషన్ తీసుకోవలసిన బాలింతలు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. రేషన్ సరుకులు కూడా చెడిపోయే పరిస్థితి ఉండటంతో అధికారుల ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగులు సెంటర్లను స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ రాట



రాట మహోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ రాట ఉత్సవాన్ని గురువారం కనులపండువగా నిర్వహించారు. నాతయ్యపాలెంలోని శ్రీ కోదండ రామాలయం ప్రాంగణంలో శ్రీ వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయం వద్ద ఈ కార్యక్రమం జరిపించారు. ఆలయ ధర్మకర్త అక్కిరెడ్డి ప్రకాష్ మాట్లాడుతూ ఈ నెల 18న సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని స్వామి కల్యాణం జరిపిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటరావు, బాలభాస్కర శ్రీనివాసరావు, అక్కిరెడ్డి శ్రీను, కృష్ణ, సంగ్రాన నర్సింగరావు, జి.పురుషోత్తం, మహిళలు పాల్గొన్నారు.

‘గుర్తింపు యూనియన్‌తో కార్మికులకు అన్యాయం’

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ, యాజమాన్యం వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ ఆరోపించారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో గురువారం జరిగిన విస్తృత కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాజమాన్యం ఒక్కొక్క ప్రయోజనం తొలగిస్తున్నా ఏఐటీయూసీ, గత గుర్తింపు సంఘం సీఐటీయూ ప్రశ్నించడం లేదన్నారు. యాజమాన్యం కార్మిక ప్రయోజనాలపై దుర్మార్గంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, బీఎంకె నాయక్, బి.ఎస్. రాజు, జి.వి. సుబ్బయ్య, ఎస్.ఎ. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ క్రీడాకారులకు విరాళం

గాజువాక: ఈ నెల 17న గాజువాకలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు గురువారం రూ.5 వేల విరాళం అందజేశారు. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 600 మంది క్రీడాకారులు హాజరు కానున్నారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బాటా శ్రీను, సన్నీ, వెంకట్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

- ఇటీవల ఉక్కునగరంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచిన గంగవరం లయన్స్ స్టార్ టీమ్‌కు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ట్రోఫీ, నగదు అందజేశారు.

చిత్రలేఖనం, హ్యాండ్‌రైటింగ్ పోటీల్లో పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులు

గాజువాక: ముంబయిలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనం, హ్యాండ్ రైటింగ్ పోటీల్లో గాజువాకలోని స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ చిన్నారులకు బంగారు పతకాలు లభించాయి. రంగోత్సవ్ 2023 పేరిట నిర్వహించిన ఈ పోటీల్లో టాప్ 2 జాతీయ స్థాయి అవార్డులు, 23 బంగారు పతకాలు, ఐదు కాంస్య పతకాలు, మూడు కన్సొలేషన్ బహుమతులను సాధించినట్లు చిత్రకళ ఉపాధ్యాయుడు డి.శ్రీనివాస్ మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ ఎం.రామునాయుడు తదితరులు అభినందించారు.

రుద్రభూమిలో తుప్పల తొలగింపు

పెదగంట్యాడ: 77వ వార్డు పిట్టవానిపాలెంలోని శ్మశాన వాటికలో తుప్పలను జీవీఎంసీ సిబ్బంది గురువారం తొలగించారు. శ్మశానవాటికలో పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో దహనసంస్కారాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై స్థానికుల నుంచి అందిన ఫిర్యాదులపై స్పందించిన జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. జేసీబీ సాయంతో పిచ్చి మొక్కలు తొలగింపజేశారు.